

వేసవి కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్

గుంటూరు వెస్ట్: వేసవిని ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని జేసీ జి.రాజ కుమారి తెలిపారు. సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీసీలో ఆమె మాట్లాడారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.7,000, మోడల్ ధర రూ.6,500 వరకు పలికింది.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ 42.9635 టీఎంసీలుగా ఉంది. ఎగువ నుంచి 2,000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.

న్యూస్‌రీల్

25 శాతం ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: విద్యాహక్కు చట్టం కింద జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను ఆదేశించారు. గురువారం బాపట్ల కలెక్టరేట్‌లో ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై పాఠశాలల యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 25 శాతం ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలు ఈ రోజు సాయంత్రంలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాని ఆదేశాలు ఇచ్చామన్నారు. పాఠశాలల్లో విద్యాహక్కు చట్టాన్ని తెలియజేసే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. పాఠశాల ప్రాంగణంలో హెల్ప్ డెస్క్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పిల్లల ఆరోగ్య సంరక్షణ చేపట్టాలన్నారు. పిల్లలకు చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణ నేర్పాలన్నారు. పిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోక్సో చట్టం గురించి పాఠశాలల్లో పిల్లలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, బాపట్ల, పర్చూరు డివిజన్‌లకు సంబంధించిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

96.53 శాతం మంది విద్యార్థులు హాజరు

బాపట్ల అర్బన్: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 34 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,658 మంది విద్యార్థులకు గాను 8,358 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 300 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయ్యారని ఆర్‌ఐఓ ఆంజనేయులు తెలిపారు. జిల్లా ఉన్నత విద్యాశాఖాధికారులు వేమూరు, రేపల్లె పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 10 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు నాలుగు పరీక్ష కేంద్రాలను తనఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్ గానీ, ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని ఆర్‌ఐఓ ఆంజేయులు తెలిపారు.

20న ఐటీఐ కళాశాలలో మెగా అప్రంటీస్ మేళా

చెరుకుపల్లి: గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 20వ తేదీ నిర్వహించనున్న మెగా అప్రంటీస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ హుల్దాలాల్ తెలిపారు. 2022 సంవత్సరానికి ముందు ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పూర్తి చేసుకుని పాస్ సర్టిఫికెట్ పొందినవారు హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ మెగా అప్రంటీస్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌తో పాటు పాస్‌పోర్టు ఫొటోలతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 93986 50408 నంబరులో సంప్రదించాలన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 536.70 అడుగుల వద్ద ఉంది. ఇది 181.5216 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,500, ఎడమకాలువకు 9,166, ఎస్‌ఎల్‌బీసీకి 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 20,666 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 20,666 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

మిరప, పసుపు రైతులు అప్రమత్తంగా ఉండాలి

కొరిటిపాడు(గుంటూరు): నేటి నుంచి మూడు రోజుల పాటు అధిక వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ సూచించిందని, మిర, పసుపు రైతులు కోతలు కోయవద్దని జిల్లా ఉదాన అధికారి ఎన్.సుజాత గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటికే కోసి కల్లాల్లో ఆరబోసిన మిరప కాయలు, పసుపు కొమ్ములను సిల్పాలిన్, టార్పాలిన్ పరదాలతో కప్పుకొని తగు జాగ్రత్తలు చేసుకోవాలని కోరారు. మిరప కాయలు, పసుపును సురక్షిత ప్రాంతాలలో నిల్వ చేసుకోవాలని సూచించారు. వర్షాలు ఆగిన తర్వాత మాంకోజెట్, బావిస్టిన్ కలిపిన మందును 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకున్నట్లయితే తాలు కాయలు రాకుండా కాపాడుకోవచ్చన్నారు.

సాగు సంక్షేమ బడ్జెట్!

- వ్యవసాయ రంగానికి అగ్రతాంబూలం
- విద్యకు 16 శాతం, వైద్యానికి 8 శాతం నిధులు
- సంక్షేమానికి పెద్దపీట



సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023–24 వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ఒక పక్క అగ్రతాంబూలం వేస్తూ ఇటు సంక్షేమంతో పాటు అటు రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసేలా ఉందని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రూ.2,79,279 కోట్లతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఉదయం శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అగ్రతాంబూలం వేసింది. రైతుపక్షపాత ప్రభుత్వంగా పేరొందిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతుల అభివృద్ధే ధ్యేయంగా అనేక పథకాలను అమలుచేస్తోంది. సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవడంతో పాటు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసింది. ఆ తర్వాత 16 శాతం నిధులు కేటాయించి విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనివ్వగా, 8 శాతం నిధులు కేటాయించి వైద్యానికి ప్రాముఖ్యతను ఇచ్చింది. తాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇస్తూనే పరిశ్రమలు, పోర్టులు, రహదారుల అభివృద్ధితో పాటు మిగిలిన రంగాలకు బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 5వ సారి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌పై అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో వ్యవసాయరంగం అభివృద్ధి

ప్రభుత్వం తాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయించడంతో జిల్లాలో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందనుంది. కృష్ణా, డెల్టా ఆధునికీకరణకు బడ్జెట్‌లో రూ.202.61 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో కృష్ణా, డెల్టా పరిధిలో ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల, చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని ఆయకట్టు భూములకు సజావుగా సాగునీరు అందుతుంది. రేపల్లెలో 80 వేల ఎకరాలు, వేమూరులో 90 వేల ఎకరాలు, బాపట్లలో 37 వేల ఎకరాలు, కొమ్మమూరు కాలువ పరిధిలో చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లో లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. అటు నాగార్జున సాగర్ కాలువ పరిధిలోనూ ఆయకట్టుకు సులభంగా నీరు చేరే అవకాశం ఉంది. చిన్ననీటి పారుదల రంగానికి ప్రభుత్వం రూ.485.31 కోట్లు కేటాయించింది. దీంతో జిల్లాలోని చెరువులు, గుంటల పరిధిలో ఆధునికీకరణ పనులు జరగనున్నాయి. ఈ పనులు పూర్తయితే మరింత ఆయకట్టు సాగులోకి రానుంది.

నేతన్న నేస్తం పథకానికి రూ.200 కోట్లు కేటాయింపు

నేతన్ననేస్తం పథకానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించింది. జిల్లాలో చీరాలతో పాటు పలు ప్రాంతాల్లో చేనేతలు ఉన్నారు. వీరందరికి మేలు జరగనుంది. దీంతో పాటు మత్స్యకార భరోసాకు ప్రభుత్వం రూ.120 కోట్లు కేటాయించింది. జిల్లాలోని రేపల్లె, బాపట్ల, చీరాల నియోజకవర్గాల పరిధిలో మత్స్యకారులు అధికంగా ఉన్నారు. వీరందరికీ మేలు జరగనుంది. మత్స్యకారుల డీజిల్ కోసం మరో రూ.50 కోట్లు నిధులు కేటాయించారు. దీంతో సముద్రంలో వేటాడుకునే మత్స్యకారులకు మరింత ఊరట లభించనుంది. దీంతో పాటు ప్రకృతి విపత్తుల కింద రూ.2000 కోట్ల నిధులు కేటాయించారు. ప్రమాదవశాత్తు ప్రకృతి విపత్తులు సంభవిస్తే లబ్ధి చేకూర్చే అవకాశం ఉంది. తీరప్రాంతం అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఇప్పటికే మొదటి దశలో నాలుగు పోర్టులను నిర్మిస్తున్నారు. రెండవ దశలో మరిన్ని పోర్టులను నిర్మించాలన్నది లక్ష్యం. వీటితో పాటు విద్యాదీవెన, వైఎస్సార్ చేయూత, అమ్మఒడి, మహిళలకు, రైతులకు వడ్డీలేని రుణాలు, జగనన్న చేదోడు, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, ఈబీసీ నేస్తం, కల్యాణమస్తు తదితర సంక్షేమ పథకాలకు ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది.

విద్యకు 16 శాతం నిధులు

విద్యారంగానికి ప్రభుత్వం 16 శాతం నిధులు కేటాయించింది. దీంతో జిల్లాలో నాడు–నేడు కింద చేపట్టిన పాఠశాలల ఆధునికీకరణ పనులు పూర్తి కానున్నాయి. దీంతో పాటు వైద్య రంగానికి 8 శాతం నిధులు కేటాయించారు. దీంతో బాపట్ల మెడికల్ కళాశాల పనులతో పాటు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న నాడు–నేడు వైద్యం పనులు త్వరితగతిన పూర్తి కానున్నాయి.

అభివృద్ధిని పరుగులు పెట్టించే బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్ అభివృద్ధిని మరింత పరుగులు పెట్టిస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారు. పేదలకు మరింత సాయం అందించే దిశగా, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా బడ్జెట్‌ను తీసుకువచ్చారు. విద్య, వైద్యం, వ్యవసాయం, నీటిపారుదలతో అన్ని రంగాలను సమతుల్యత కల్పించారు.

– డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు

డెవలప్‌మెంట్ ఏపీ ఎక్స్‌ప్రెస్ బడ్జెట్ ఇది..



డెవలప్‌మెంట్ ఏపీ ఎక్స్‌ప్రెస్ బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. రైతు భరోసా కేంద్రాల వంటి వాటి ద్వారా వ్యవసాయ రంగంలో అర్థవంతమైన సంస్కరణలు అమలుకు మరింత ఎక్కువగా నిధులు కేటాయించారు. సంక్షేమానికి కేటాయించే ప్రతి రూపాయి మానవ వనరుల అభివృద్ధికి, తద్వారా రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుందనే వాస్తవం ఈ బడ్జెట్‌లో తేటతెల్లమయ్యింది.

– ఆచార్య కె.మధుబాబు, ఏఎన్‌యూ అర్థశాస్త్ర విభాగాధిపతి

సంక్షేమ రంగానికి పెద్దపీట



విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం, అభివృద్ధికి అన్ని విధాల సమతూల్యంగా బడ్జెట్ ఉంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, కాపులకు సంక్షేమ పథకాలు అందించేందుకు బడ్జెట్‌లో కేటాయింపు జరిగింది. రాష్ట్ర విభజన తర్వాత ఇంత పెద్ద బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చేలా బడ్జెట్ ఉంది. అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్ ఇది.

– ఆతుకూరి ఆంజనేయులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

బడ్జెట్ అన్నివర్గాల అభివృద్ధికి అద్దం పట్టేలా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల అభివృద్ధికి అద్దం పట్టేలా ఉంది. వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. సంక్షేమానికి భరోసా నిచ్చేలా ఉంది. ఏ రంగానికి ఎంత ఇవ్వాలో ఆ మేరకు ముఖ్యమంత్రి ఆ రంగానికి తగినంతగా నిధులు కేటాయించారు. బడ్జెట్ సామాజిక విప్లవాన్ని ప్రతిబింబిస్తోంది. సంక్షేమ పథకాలకు కొరత లేకుండా తగినన్ని నిధులు కేటాయించారు.

– మేరుగ నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

అన్నిరంగాల అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లోనూ వ్యవసాయం, సంక్షేమం, అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోంది. ఆర్థిక ఇబ్బందులు, కోవిడ్ కష్టాలు ఉన్నా ప్రభుత్వం పైరంగాలకు నిధులు క్రమం తప్పకుండా ఇస్తోంది. వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. రాష్ట్రంలో తీర ప్రాంతం అధికంగా ఉంది. మొదటి దశలో ప్రభుత్వం నాలుగు పోర్టులను నిర్మించనుంది. మలిదశలో మరిన్ని పోర్టులను నిర్మించబోతోంది. సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

– మోపిదేవి వెంకటరమణారావు, రాజ్యసభ సభ్యుడు

బడుగు వర్గాల సంక్షేమ బడ్జెట్



అన్నివర్గాల మహిళల సంక్షేమానికి, మహిళ సాధికారతకు బడ్జెట్‌లో పెద్ద పీట వేశారు. అమ్మఒడి ద్వారా పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించి తల్లుల్లో మనోధైర్యం నింపారు. ముఖ్యంగా నిరుపేదలు, బడుగు వర్గాల సంక్షేమ బడ్జెట్ ఇది.

– భవానీ, గృహిణి

అమరజీవి పోరాటం ఆదర్శనీయం

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: త్యాగానికి ప్రతీకగా అమరజీవి పొట్టి శ్రీరాములును గుర్తుంచుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ పోరాట పటిమలో పొట్టి శ్రీరాములును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, డీఈఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని కాపాడిన పొట్టి శ్రీరాములు

తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచమంతా చాటిన తొలి వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని వ్యవసాయ కళాశాల అసోసియేట్ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ ఎస్.రత్నకుమారి పేర్కొన్నారు. కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు.

వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో..

బాపట్ల జిల్లా వాసవి సేవా సమితి సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో షరాబజార్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గాదంశెట్టి శ్రీనివాసరావు, పువ్వాడ నాగేశ్వరరావు, తటపర్తి ప్రతాప్, బాబు నాగేంద్ర, గుండా సత్యనారాయణ, తటపర్తి గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



అమరజీవికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ డాక్టర్ శ్రీనివాసులు


మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: మహనీయుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టిశ్రీరాములు 122వ జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత అమరజీవి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని చెప్పారు. అప్పట్లో మద్రాస్ రాష్ట్రంలో ఉన్న తెలుగు మాట్లాడే పదకొండు జిల్లాలను ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో శ్రీపొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించి పట్టువీడకుండా తన దీక్షను కొనసాగించి రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఆయన త్యాగం తెలుగు ప్రజలు ఎప్పటికీ మరువరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డీసీఆర్‌బీ డీఎస్పీ జి.లక్ష్మయ్య, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్‌ఐ ఇ.శ్రీకాంత్‌నాయక్ పాల్గొన్నారు.

ఇద్దరు బిడ్డలతో తల్లి ఆత్మహత్యాయత్నం



మార్టూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత తన ఇద్దరు బిడ్డలతో సహా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన గురువారం మార్టూరులోని రాంజనార్దన్ కాలనీలో జరిగింది. 108 సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కాలనీకి చెందిన కుంభా గోపి, లక్ష్మి దంపతులు. వీరికి ఏడేళ్ల దీక్షిత, మూడేళ్ల వయస్సు గల ఆశిష్ అనే ఇద్దరు సంతానం ఉన్నారు. గత మూడు నెలల క్రితం భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఒకే ఇంట్లో ఉంటున్నా గోపి తన భార్య లక్ష్మితో మాట్లాడటం లేదు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన లక్ష్మి పురుగుల మందు, పెట్రోల్ కలుపుకుని తనతో పాటు తన బిడ్డలకు తాగించింది. ఇది గమనించిన సమీప బంధువులు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఖోఖో ఖిల్లా పంగులూరు!

- అంతర్జాతీయ ఖోఖో పోటీలకు శివనాగిరెడ్డి ఎంపిక
- ఈ నెల 20న అసోంలో టోర్నమెంట్
- పంగులూరు నుంచి నలుగురు అంతర్జాతీయ స్థాయిలో సత్తా



అసోంలో శిక్షణ తీసుకుంటున్న శివనాగిరెడ్డి (ఫైల్), అట్ల శివనాగిరెడ్డి (ఇన్‌సెట్‌లో)

జె.పంగులూరు: ఖోఖో క్రీడంటే క్రీడాభిమానులు ఎగిరి గంతేస్తారు. ఆటలో నైపుణ్యం.. పరుగులు పెడుతూ జట్టును చైతన్యం చేయడం.. చురుకుదనం ఈ ఆటకు ప్రాణం. ఇలాంటి క్రీడను పంగులూరు యువత సొంతం చేసుకుంది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇక్కడ నుంచి ఎంపికైన ఎందరో క్రీడాకారులు ఎన్నో కప్పులు కొల్లగొట్టారు. బాపట్ల జిల్లా ఖ్యాతి చాటుతున్నారు.

పీఈటీ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో..

రాష్ట్ర స్థాయిలోనే కాంకుండా జాతీయ స్థాయిలోనూ ఖోఖో అంటే వెంటనే పంగులూరు గుర్తుకు రావాల్సిందే. గత మూడు దశాబ్దాల నుంచి పంగులూరులో పీఈటీ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఖోఖో క్రీడకు ఆదరణ లభిస్తోంది. పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణ జూనియర్ కళాశాల నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి శభాష్ అనిపించుకున్నారు. గతంలో ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటి ఉద్యోగాల్లో స్థిరపడగా తాజాగా ఇదే కళాశాలలో చదివి, ఏఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ తీసుకొన్న అట్ల శివనాగిరెడ్డి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం గమనార్హం. శివనాగిరెడ్డి స్వగ్రామం బాపట్ల జిల్లా శ్రీరామ్‌నగర్. చిన్నతనంలోనే పంగులూరు ఖోఖో అకాడమీలో చేరి శిక్షణ పొందాడు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఇంటర్, ఇంకొల్లు డీసీఆర్ఎం కళాశాలలో డిగ్రీ, గుంటూరులో బీపీఈడీ పూర్తి చేశాడు. ప్రస్తుతం చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు అసోంలోని గుహాటి పట్టణంలో ఇంటర్నేషనల్ ఖోఖో (4వ ఏషియన్ గేమ్స్) టోర్నమెంట్‌కు, దేశ జట్టు తరపున అట్ల శివనాగిరెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ప్రస్తుతం గుహాటిలో శిక్షణ పొందుతున్నాడు. మొత్తం 16 దేశాలు పోటీ పడనున్నాయి.

శివనాగిరెడ్డి సాధించిన పతకాలు


- గత 10 సంత్సరాల నుంచి మూడు సార్లు జూనియర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి సిల్వర్ మెడల్ సాధించాడు.
- ఆరు సార్లు సీనియర్ జాతీయ స్థాయి, రెండు సార్లు జాతీయ క్రీడల్లో, ఐదు సార్లు సౌత్ జోన్ ఖోఖో పోటీల్లో పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలు పొందాడు.
- 2023 జనవరిలో జరిగిన ఆల్ ఇండియా యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో బంగారు పతకం సాధించి ఉత్తమ క్రీడాకారునిగా ఎంపికయ్యాడు.
- 2022 ఆగస్టులో జరిగిన అల్టిమేట్ ప్రోఖోఖో లీగ్ టోర్నమెంట్‌లో చెన్నై క్విక్ గన్స్ తరపున ఆడాడు.
- రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరపున ఆడి బంగారు పతకాలు సాధించాడు.

ముగ్గురూ ముగ్గురే..

- 1998లో భవనం కాశీవిశ్వనాథరెడ్డి శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ స్థాయిలో దేశం తరపున బంగారు పతకం అందించారు. ప్రస్తుతం కంచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయునిగా, జిల్లా ఖోఖో కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు.



- 2016 సంవత్సరంలో పాలకీర్తి శ్రీను ఢిల్లీలో జరిగిన 2వ ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించారు. స్పోర్ట్స్ కోటాలో ఇండియన్ రైల్వే విభాగంలో నాందేడ్‌లో ఉద్యోగం చేస్తున్నారు.



- 2018లో పి.శివారెడ్డి ఇంగ్లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ వరల్డ్ కప్పు ఖోఖో పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించారు. ప్రస్తుతం ఇండియన్ పోస్టల్‌లో ఉద్యోగం సాధించి అదిలాబాద్‌లో ఉంటున్నారు.



గ్రామస్తుల సహకారం మరువ లేనిది



గత మూడు దశాబ్దాల నుంచి గ్రామస్తుల సహకారం మరువలేనిది. పంగులూరు గ్రామంలోని జూనియర్ కళాశాలలో ఆడిన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నత స్థాయికి ఎదిగారు.

– మేకల సీతారామిరెడ్డి, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి

అంతర్జాతీయ పోటీలు నిర్వహించాలని ఉంది



పంగులూరు గ్రామంలో ఇప్పటికే రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ఖోఖో పోటీలు నిర్వహించాం. అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో పోటీలు నిర్వహించాలనిఉంది.

– బాచిన చెంచుగరటయ్య, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్

క్రీడాకారులు ఎంపిక కావటం సంతోషం



ముప్పైఏళ్లుగా మా నాన్న ఖోఖో క్రీడాకు ఎంతో సహకారం అందించారు. అదేవిధంగా నా వంతుగా సహకారం అందిస్తా. జగనన్న ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోంది.

– బాచిన కృష్ణచైతన్య, ఏపీ శాప్ నెట్ చైర్మన్

క్రీడా కర్మాగారం పంగులూరు



ప్రతిభగల క్రీడాకారులు పంగులూరు నుంచి వస్తున్నారు. గత 30 సంవత్సరాల నుంచి మేకల సీతారామిరెడ్డి, గ్రామస్తుల సహకారం గుర్తుంచుకుంటాం.

– ఎంఎస్ త్యాగి, జనరల్ సెక్రటరీ, ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ

క్లుప్తంగా

నేతన్నల కోసం ప్రత్యేక బడ్జెట్ ఘనత జగనన్నదే

దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర



చీరాల: రాష్ట్రంలోని పేదల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయింపులతో పాటుగా బీసీ పక్షపాతిగా బీసీలకు అనేక సంక్షేమ పథకాలు అందించి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచారని దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర అన్నారు. గడిచిన నాలుగేళ్లల్లో నేతన్న నేస్తానికి రూ.750 కోట్లు కేటాయించి సొంతమగ్గం ఉన్న ప్రతి నేతన్నకు ఏడాదికి రూ.24వేలు పెట్టుబడి సాయం అందించి చేనేతల పక్షపాతిగా నిలిచారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నేతన్న నేస్తం చేనేతల కోసం ప్రత్యేకంగా రూ.200 కోట్లు కేటాయించి చేనేత సంక్షేమం కోసం కృషి చేసి చేనేతలకు వెన్నుదన్నుగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు చేనేతలు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు. చేనేతల సంక్షేమం, చేనేత రంగం అభివృద్ధికి ప్రత్యేక పథకాలు చేపట్టి ఉత్పత్తుల అమ్మకాలు సక్రమంగా చేయించేందుకు ప్రణాళికాబద్ధంగా సీఎం పనిచేస్తున్నారు. ప్రభుత్వంలో చేనేత సంక్షేమంతోపాటుగా అన్నీ వర్గాల అభివృద్ధికి సమన్యాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగనన్నకే దక్కింది.

అటవీ భూముల రీ-సర్వే సక్రమంగా చేయండి

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షణ పథకం కింద అటవీ భూముల రీ-సర్వే సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులకు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఫారెస్టు కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.రామచంద్రరావు, ఇతర అధికారులతో పలు అంశాలపై సమీక్ష చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్టు ఆల్బమ్‌ను అటవీశాఖాధికారి జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి నాటికల పోటీలు

మార్టూరు: శ్రీకారం, రోటరీ కళాపరిషత్ మార్టూరు ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు గురువారంతో ముగిశాయి. మూడు రోజుల్లో మొత్తం 11 నాటికలు ప్రదర్శించిన కళాకారులు ఒక నాటికను మించి మరొకటి ప్రేక్షకులను రక్తికట్టించారు. గురువారం రాత్రి మొదటగా గంగోత్రి సాయి దర్శకత్వంలో అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారు 'వెండి అంచులు' నాటికను ప్రదర్శించారు. నేటి ఆధునిక భారతంలో కూడా పురుషాధిక్య పునాదులు కింద నలిగిపోతున్న స్త్రీల సమస్యలను కళాకారులు సున్నితంగా ఆవిష్కరించారు. అన్ని రంగాల్లో స్త్రీ, పురుషులు సమానమేనని చెప్పుకుంటున్న నేటి సమాజంలో స్త్రీలకు మాత్రమే సంబంధించిన పునరుత్పత్తి హక్కుపై పురుషుల ఆధిపత్యాన్ని నాటికలోని స్త్రీ పాత్రలు కావేరి, గోమతి నిర్భయంగా ప్రశ్నిస్తాయి. స్త్రీ, పురుషులు శారీరక సుఖాన్ని సమానంగా పొందినంత మాత్రాన స్త్రీలకు గల బిడ్డలను కనే హక్కుపై నిర్ణాయక శక్తి పురుషులది కావటం కన్నా అమానవీయత మరొకటి ఉండబోదని, మాతృత్వపు హక్కు స్వేచ్ఛ స్త్రీలకు మాత్రమే చెందాలని నిర్భయంగా చెప్పటంలో నాటిక విజయవంతం అయింది.

నవ్వించిన పక్కింటి మొగుడు..

ఇతరుల అవసరాలను అవకాశంగా మలచుకొని ఎదుటి వారిని బ్లాక్ మెయిల్ చేస్తూ బతకాలనుకోవడం తప్పని, న్యాయవ్యవస్థలో లాయర్లు నిజాయితీగా ఉన్నప్పుడే ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందని హాస్య ప్రధాన ఇతివృత్తంతో బీ నాగేశ్వరరావు దర్శకత్వంలో పండు క్రియేషన్స్ కొప్పోలు వారు 'పక్కింటి మొగుడు' నాటికను ప్రదర్శించారు.

భార్యాభర్తలు అన్యోన్యంగా ఉంటేనే తమ ఆస్తి మనవడికి దక్కుతుందని వీలు రాసి వృద్ధ దంపతులు మరణిస్తారు. ఆ వీలునామాను అవకాశంగా తీసుకొని లబ్ధి పొందాలనుకున్న ఓ లాయర్ ఎలా బుద్ధి చెప్పారనే అంశంపై నాటిక ముగుస్తుంది. ప్రపంచీకరణ సమాజానికి మేలు చేసిందా, కీడు చేసిందా అనే ప్రశ్నను ప్రేక్షకులపై సందిస్తూ ఉషోదయ కళానికేతన్ పెద్రపాడు వారు చెరుకూరు సాంబశివరావు రచన దర్శకత్వంలో ప్రదర్శించిన నాటికే ప్రక్షాళన. టెక్నాలజీ మాయలో మునిగి తేలుతున్న నేటి యువత సంస్కార రాహిత్యంతో విలువలను మరచి ప్రవర్తిస్తూ ఎంతో మంది యువతుల జీవితాలను బలి తీసుకుంటున్నారు. తులసి వనంలో గంజాయి మొక్కలను ఏరిపారవేసి సమాజాన్ని ప్రక్షాళన చేయాలనే ఇతివృత్తంతో ప్రదర్శించిన నాటిక ప్రస్తుత సమకాలీన సమాజంలో రగులుతున్న సమస్యలకు దర్పణం పడుతూ ముగింపు హృద్యంగా సాగింది. నాటికలను తిలకించడానికి పెద్దఎత్తున జనం హాజరయ్యారు.



ప్రక్షాళన నాటికలో ఓ సన్నివేశం

19న సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): శాప్ ఆధ్వర్యంలో ఈ నెల 19న తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో సీనియర్ మహిళా కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని స్టెప్ సీఈఓ పల్లవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్టు ఈ నెల 23 నుంచి 26 వరకు హర్యానాలో జరగనున్న 69వ సీనియర్ మహిళా కబడ్డీ పోటీలకు పంపిస్తామన్నారు.

అండర్-17 బాలబాలికల చెస్ పోటీలు

జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న ద్వారకా కృష్ణ రెయిన్ ట్రీ పార్క్‌లో అండర్-17 బాల బాలికల చెస్ పోటీలు నిర్వహిస్తామని అధ్యక్షులు సీహెచ్ రవీంద్ర రాజు గురువార ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ప్రతిభకనబరచిన వారిని త్వరలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 79816 64035 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

906 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

- రైస్ మిల్లులో భారీమొత్తంలో పీడీఎస్ బియ్యం నిల్వలు
- విజిలెన్స్ అధికారుల తనిఖీలు



నకరికల్లులోని చల్లగుండ్ల వద్ద రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

నకరికల్లు: ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న ప్రజాపంపిణీ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసినట్లు విజిలెన్స్ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పల్నాడు జిల్లా నకరికల్లులోని చల్లగుండ్ల వద్ద గల వనదుర్గ రైస్‌మిల్లు లీజ్‌కు తీసుకొని అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం దాడులు నిర్వహించినట్లు తెలిపారు. రికార్డులు తనిఖీచేయగా 125.83 క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామన్నారు. అనంతరం మిల్లు లీజుదారుడు టి.శ్రీనివాసరావును విచారణ చేసి విషయం రాబట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజాపంపిణీ బియ్యం కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. మిల్లులోని 906క్వింటాల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకొని 6ఏ కేసునమోదు చేశామన్నారు. మిల్లు లీజుదారునిపై క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు సంబంధితశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, సీఐ ఎ.శ్రీహరిరావు, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

14 గ్రానైట్ లారీల పట్టివేత



కారెంపూడి: అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న 14 లారీలను పట్టుకుని తగు చర్యల నిమిత్తం దాచేపల్లి మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు అప్పగించామని ప్రాంతీయ నిఘా, అమలు అధికారి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. కారెంపూడి సమీపంలోని శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద, కారెంపూడిలో, మా చర్ల సాగర్ రోడ్డులో బుధవారం రాత్రంతా నిఘా పెట్టి అక్రమంగా తరలిపోతున్న గ్రానైట్ లారీలను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పట్టుకున్న వాటిలో 13 లారీలలోని గ్రానైట్‌కు మైనింగ్ ట్రాన్సిట్ పాసులు లేవని, మరో లారీకి ఈ వే బిల్లు లేకుండా వెళ్తున్నాయని పేర్కొన్నారు. గ్రానైట్ లారీలు ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి కారెంపూడి మీదగా ఏవిధమైన బిల్లులు లేకుండా హైదరాబాదు, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు అక్రమంగా తరలిపోతున్నాయని అందిన సమాచారం మేరకు నిఘా పెట్టి ఈ గ్రానైట్ లారీలను పట్టుకున్నామని పేర్కొన్నారు.

అకడమిక్ ఎగ్జిబిషన్‌లో నూతన ఆవిష్కరణలు

- అబ్బురపరచిన ప్రదర్శనలు
- ప్రతిబింబించిన సామాజిక,శాస్త్ర, సాంకేతికత
- కళాశాలలు, పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరు
- ఆసక్తిగా వీక్షించిన సందర్శకులు
- ప్రత్యేక ఆకర్షణగా వాట్సాప్ క్విజ్, బెస్ట్ సెల్ఫీకాంటెస్ట్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కొనసాగుతున్న అకడమిక్ ఎగ్జిబిషన్‌లో రెండో రోజైన గురువారం పలు ప్రదర్శనలు విజ్ఞానం, వినూత్నాన్ని పంచాయి. సోషల్ సైన్సెస్, సైన్స్, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషన్ రంగాలకు చెందిన విద్య, పరిశోధనా విభాగాలు 180 స్టాల్స్‌లో 850కిపైగా విభిన్న అంశాలపై ప్రదర్శలు, ఆవిష్కరణలు చేశాయి. సామాజికాభివృద్ధి, చరిత్ర, సంస్కృతి, కళలు, శాస్త్ర, సాంకేతిక, పర్యాటక, ఆరోగ్య పరిరక్షణ, వ్యాయామం, శారీరక దారుఢ్యం, న్యాయ సలహాలు, తదితర అంశాలపై ప్రదర్శనలు సందేశాత్మకంగా సాగాయి. పలు విభాగాల ప్రదర్శనలు ఆహ్లాదాన్ని, ఆరోగ్య పరిరక్షణను చాటుగా పలు విభాగాల ప్రదర్శలు విద్యార్థులు, సందర్శకుల్లో మేథస్సును పెంపొందించాయి. విద్య, పరిశోధనాంశాల ఆవశ్యకత, ఫార్మసీ రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలు, అంతరిక్ష ప్రయోగాలు, పచ్చదనం పరిరక్షణ, సహజవనరుల సద్వినియోగం అంశాల వంటి సామాజిక బాధ్యతను వివరిస్తూ చేసిన ప్రదర్శనలు విద్యార్థులను ఆలోచింపజేశాయి. వీటితోపాటు చరిత్ర, జాతీయ నాయకుల జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేసే ప్రదర్శనలు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా సాంకేతిక ప్రదర్శనలు

, అకడమిక్ ఎగ్జిబిషన్‌లో ఎకో టూరిజం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకుని పలు ప్రాంతాలలో ఉన్న పర్యాటక ప్రాంతాలు, అక్కడ ఉన్న వసతులు, ప్రత్యేకతలు తెలిపే డిజిటల టూరిజం,పీఎస్ఎల్‌వీ మిస్సైల్స్ వంటి అంతరిక్ష ప్రయోగాలు, డిజిటల్ కమ్యూనికేషన్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పరిజ్ఞానం, మన సంస్కృతి, సాంప్రదాయాలు, పురాతన ఆలయాలు, గ్రీకుల కాలం నాటి కట్టడాలు వినూత్నంగా సాగాయి. వీటితోపాటు ఆరోగ్యం ఆవశ్యకతను తెలియజేస్తూ సీపీఆర్, యోగా, మెడిటేషన్, వ్యాయామం వంటి, సంస్కృతిలో భాగమైన తోలుబొమ్మలాట, పలు అంశాలపై న్యాయసలహాలు ఏ విధంగా పొందాలనే అంశాలు వివరించారు.

భారీగా సందర్శకులు హాజరు

రెండు రోజులపాటు జరిగిన అకడమిక్ ఎగ్జిబిషన్‌ను 15,800 మందికిపైగా విద్యార్థులు, సందర్శకులు వీక్షించారని ఎగ్జిబిషన్ కోఆర్డినేటర్ ఆచార్య కె మధుబాబు, డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య తెలిపారు. వీరిలో 18 పాఠశాలలు, 7 కళాశాలు ఉన్నాయన్నారు. రెండోరోజు ప్రదర్శనలను వీసీ ఆచార్య పి రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, పలువురు యూనివర్సిటీ అధికారులు సందర్శించి సందర్శకుల జాబితాలలో తమ అభిప్రాయాలు రాశారు.

ప్రత్యేక ఆకర్షణగా వాట్సాప్ క్విజ్

ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ డెస్క్ నిర్వహిస్తున్న వాట్సాప్ క్విజ్, బెస్ట్ సెల్ఫీ కాంటెస్ట్, స్లోగన్ కాంపిటీషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి గంటకు మైక్ ద్వారా ఒక ప్రశ్నను చెప్పి దానికి జవాబును నిర్వాహకుల వాట్సాప్‌కు పంపమని సూచిస్తున్నారు. గంట తరువాత సరైన జవాబులు పంపిన వారిలో లక్కీడీప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి గంటగంటకూ బహుమతులు అందజేస్తున్నారు. అకడమిక్ ఎగ్జిబిషన్ శుక్రవారంతో ముగియనుంది. ముగింపు సభకు హైదరాబాద్ డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డాక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు.ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేస్తారు.



6 భాషలను నేర్పుతున్న భౌద్ధ మతస్తులు

ఆధార్ నవీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

– జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియ వేగంగా చేపట్టాలని సచివాలయాల సిబ్బందిని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియపై గురువారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆమె సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లా జనాభాలో 97 శాతం ఆధార్ కార్డులు ప్రజలకు ఉన్నాయన్నారు. మిగిలిన వారందరికీ కార్డులు ఇచ్చేలా చూడాలన్నారు. జిల్లాలో 57 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నడుస్తున్నాయని చెప్పారు. ఆ కేంద్రాల్లో నవీకరణ ప్రక్రియ కొనసాగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 75 వేల 680 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. వారందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డులు ఇవ్వాలన్నారు. 25 వేల 790 మంది చిన్నారులను ఆధార్‌లోకి తీసుకువచ్చారన్నారు. వారందరి పేర్లు, వేలి ముద్రలు తీసుకోవాలని చెప్పారు. మిగిలిన 49 వేల 890 మంది చిన్నారులకు ఆధార్ కార్డులు లేవన్నారు. జిల్లాలో 1888 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు కనీసం 30 కేంద్రాల్లో 1710 మంది చిన్నారుల వివరాలను ఆధార్ వెబ్‌సైట్లోకి నిక్షిప్తం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డులు పొందిన వారంతా 10 సంవత్సరాల తరువాత తప్పనిసరిగా నవీకరణ చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలన్నింటిని సంబంధిత సచివాలయాలకు మ్యాపింగ్ చేశామన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు 30 రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులందరికీ ఆధార్ కార్డులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి రోజు ఆధార్ నమోదు, ఆధార్ నవీకరణ ప్రక్రియపై కలెక్టరేట్‌కు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో సీపీఓ జి.భరత్‌కుమార్, ఆధార్ జిల్లా కో-ఆర్డినేటర్ అశోక్ బాబు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం

బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మార్టూరు: మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని, వాటి బారిన పడకుండా వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బాపట్ల డీఎస్పీ ఏ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విజయలక్ష్మి కల్యాణ మండపంలో పలు కళాశాలల విద్యార్థులకు గురువారం సాయంత్రం నిర్వహించిన సంకల్ప అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆకాశమే హద్దుగా ఉన్నత శిఖరాలకు ఎదగాలనుకునే నేటి యువతకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలను, సౌకర్యాలను కల్పిస్తుందని విద్యార్థులు వాటిని అందిపుచ్చుకొని ఎదిగేందుకు కృషి చేయాలే తప్ప మత్తు పదార్థాలకు బానిసలు కారాదని ఆయన హితవు పలికారు. విద్యార్థులను ఉపాధ్యాయులు తరగతి గదిలోను తల్లిదండ్రులు ఇంటి వద్ద వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం ద్వారా యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా చూడవచ్చన్నారు. అవసరమైన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించటం ద్వారా విద్యార్థులను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్టూరు సీఐ ఎస్కే టీ ఫిరోజ్, ఎస్సై కమలాకర్, వీరగంధం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావి అంకమ్మచౌదరి, హర్షిణి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ గద్దం ఆంజనేయులు, పర్చూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహం విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

గుంటూరు జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైరెక్టర్ ఫమీదా బేగం



మాట్లాడుతున్న విద్యా శిక్షణ సంస్థ డైరెక్టర్ ఫమీదా బేగం

చెరుకుపల్లి: ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా బోధించాలని గుంటూరు జిల్లా విద్యా శిక్షణా సంస్థ డైరెక్టర్ ఫమీదా బేగం అన్నారు. మండలంలోని గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా విద్యా శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల డివిజన్‌లో ఉన్న అన్ని మండలాల్లో ఉన్న ప్రతి స్కూల్ కాంప్లెక్స్ నుంచి ఇద్దరు రిసోర్స్ పర్సన్‌లకు టీచింగ్ లెర్నింగ్ కాన్సెప్ట్‌పై జరిగే రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శిక్షణ కార్యక్రమం రెండు విడతలుగా జరుగుతుందని మొదటిగా గుళ్లపల్లిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణలో ఎస్ఈపీ 2022లో భాగంగా పీపీ-1, పీపీ-2, ఐదో తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు కొన్ని మెలుకువలు నిపున్ భారత్ ద్వారా అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఆయా కాంప్లెక్స్‌లలో పాధ్యాయులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శిక్షణా సంస్థ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ ఎస్.కె ఖాసీం, హెచ్ఎం పులి లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఆస్పత్రులకు జరిమానా

నరసరావుపేట: ఉచితంగా చేయాల్సిన ఆరోగ్యశ్రీ వైద్య సేవలకు పేషెంట్ల వద్ద నుంచి డబ్బులు వసూలుచేసిన ఐదు ఆసుపత్రుల యాజమాన్యాలకు జిల్లా డిసిప్లేనరీ కమిటీ జరిమానా విధించింది. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా డిసిప్లేనరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 171 ఫిర్యాదులను కమిటీ సభ్యులు విచారించారు. అందులో 162 ఏఎన్ఎం మొబైల్ యాప్ సమస్యలు, ఐవీఆర్ఎస్ ఓట్‌బౌండ్ కాల్స్ ద్వారా నమోదైన తొమ్మిది సమస్యలను విచారణ చేసి డబ్బు వసూలు చేసిన ఐదు హాస్పిటల్స్‌కి జరిమానా విధించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా పేషెంట్లకు బిల్లులు లేకుండా నగదు రహిత వైద్యం అందించేలా ఆసుపత్రి యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ జిల్లా కన్వీనర్ డాక్టర్ వినీల, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి, జిల్లా ప్రభుత్వాసుపత్రుల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు, ఐ అండ్ పీఆర్ డీడీ దీప్తి పాల్గొన్నారు.